www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

శనివారం, 06-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :37 Issue : 37 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## ఎండను లెక్కచేయకుండా.. సీఎం చంద్రబాబు సైకిల్ సవారీ



- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ తొక్కిన సీఎం చంద్రబాబు
- విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సాగిన ర్యాలీ
- 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లో పూర్తి చేసిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

3



## సంక్షోభం.. సానుకూలంగా..!

- టీఎంసీలో తిరుగుబాటు.. మమతకు పెరుగుతున్న ఇబ్బందులు
- కాంగ్రెస్‌పై డీఎంకే అసంతృప్తి.. మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఇదే సరైన సమయంగా భావిస్తున్న బీజేపీ

6



## పాలమూరు వెనుకబాటుతనానికి గత
# ప్రభుత్వమే కారణం

- పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటానన్న సీఎం రేవంత్
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల కమిషన్లు తిన్నారని ఆరోపణ
- భూసేకరణ లేకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయని ప్రశ్న
- రెండేళ్లలో పెండింగ్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తామని హామీ

2



### పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్

- పెండింగ్ పనుల పూర్తి కోసం సీఎం కార్యాచరణ
- గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు కర్ణాటకతో చర్చలు

2

# కాంగ్రెస్ హామీలే అస్త్రం..
## దీర్ఘకాల పోరాటానికి బీఆర్ఎస్ వ్యూహం?

డిక్లరేషన్ల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రణాళిక
ఆరు నెలలకో ప్రధాన సభ నిర్వహించే దిశగా ఆలోచనలు
రైతు డిక్లరేషన్ తర్వాత యూత్, బీసీ డిక్లరేషన్లపై ఫోకస్
ఎన్నికల వరకు పోరాటాల జోరు కొనసాగించాలన్న లక్ష్యం



**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలుపై ప్రజా పోరాటాలను దశలవారీగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉండటంతో పోరాట కార్యక్రమాలను ఒకేసారి కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.
ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వివిధ డిక్లరేషన్ల అమలును ప్రధాన అంశంగా తీసుకుని ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా చెబుతున్నారు. హామీలు అమలు కాలేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని పార్టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్ సభకు పార్టీ నుంచి మంచి స్పందన లభించిందని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతు డిక్లరేషన్ అంశాన్నే అక్కడ ప్రధానంగా ప్రస్తావిస్తూ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..

# రెన్యువల్‌పై టెన్షన్..
## కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్లలో ఉత్కంఠ

జులైతో ముగియనున్న 37 మంది చైర్మన్ల పదవీకాలం
రెన్యువల్ కోసం పాతవాళ్లు.. అవకాశాల కోసం కొత్తవాళ్ల ప్రయత్నాలు
పని తీరుపై సీఎం అసంతృప్తి ప్రభావం చూపే అవకాశం
ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా నిర్ణయాలు ?

2





## ప్రజలకు ఉపాధి కల్పనే
# నిజమైన అభివృద్ధి

- 200 మంది మహిళలకు ప్రత్యక్ష ఉపాధి కల్పన
- సిద్దిపేటను దేశంలో రెండో షోలాపూర్‌గా తీర్చిదిద్దే అవకాశం
- దుస్తుల తయారీ పరిశ్రమను ప్రారంభించిన హరీశ్ రావు

3

## రూ.1600 కోట్ల విలువ చేసే
# బొగ్గు మాయం

- ఇప్పటివరకు అధికారులు తనిఖీలు చేయలేదు
- కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి సింగరేణిలో వరుస స్కామ్‌లు
- స్టాక్ యార్డుల్లో వుండాల్సిన బొగ్గు ఏమయింది?
- నిజం నిగ్గు తేల్చకపోతే సమ్మె తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ



**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ గా మారింది.. నైని కుంభకోణం

మిగతా 3వ పేజీలో..

## ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు



- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్ :** పేదల జీవనోపాధికి ఏమాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్‌గా తీసుకుని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ, మధ్యతరగతి వర్గాలకు

మిగతా 2వ పేజీలో..



## అధికారుల నిర్లక్ష్యమే కారణం

అమీర్‌పేట్ అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన కవిత
ముందే ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్న వ్యాపారులు

2

## రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

పుప్పాలగూడ–ఖాజాగూడలో హైడ్రా భారీ ఆపరేషన్
200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు
ఆక్రమణలకు అడ్డుకట్ట వేసిన హైడ్రా
చారిత్రక రాతిగుట్టలు, సహజ వనరుల పరిరక్షణకు చర్యలు
హైకోర్టు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలనలు

**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దులోని సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించింది. సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టింది.
హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. గతంలో

మిగతా 2వ పేజీలో..



## గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మ నాయుడు అదుపులోకి
ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం
నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు
కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



3



## నిధులు, నియామకాలు,
# నీళ్లలో విఫలం

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం
- మంత్రి ఆదేశాలతో సిబ్బందికి రేపు ప్రత్యేక శిక్షణ



3

## పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

3

# కాంగ్రెస్ హామీలే అస్త్రం..

మొదటిపేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు.
రైతు డిక్లరేషన్ తర్వాత యూత్ డిక్లరేషన్ అంశంపై ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలని తొలుత భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా అన్ని అంశాలను ఉపయోగించడం కంటే ఎన్నికల వరకు వాటిని దశలవారీగా వినియోగించడం మంచిదనే అభిప్రాయానికి పార్టీ నాయకత్వం వచ్చినట్లు సమాచారం.
ఒక డిక్లరేషన్‌పై నిర్వహించే పోరాట సభకు, మరో అంశంపై చేపట్టే కార్యక్రమానికి మధ్య తగినంత వ్యవధి ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. రైతు డిక్లరేషన్ అంశాన్ని కొంతకాలం ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంచిన తర్వాత యూత్ డిక్లరేషన్, అనంతరం బీసీ డిక్లరేషన్ వంటి అంశాలను ముందుకు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.
ప్రతిపక్షంగా ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు అందుబాటులో ఉన్న రాజకీయ అంశాలను సమయానుకూలంగా వినియోగించాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యంగా కనిపిస్తోంది. ఎన్నికల వరకు ఆరు నెలలకోసారి పెద్ద ఎత్తున సభలు, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చర్చను కొనసాగించాలనే దిశగా పార్టీ అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# రెన్యువల్‌పై టెన్షన్..

## కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్లలో ఉత్కంఠ

హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్లకు నియమితులైన 37 మంది చైర్మన్ల పదవీకాలం జులై నెలతో ముగియనుండటంతో పార్టీలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఒకవైపు ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు మరో అవకాశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా, మరోవైపు కొత్త నాయకులు పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.
2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం సీట్లు త్యాగం చేసిన నేతలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించింది. ఇప్పుడు వారి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రెన్యువల్ ఉంటుందా లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది.
కార్పొరేషన్ చైర్మన్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలా మంది పార్టీ కార్యక్రమాలకు తగిన సమయం కేటాయించడం లేదనే అభిప్రాయం కూడా నాయకత్వంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అందరికీ రెన్యువల్ అవకాశం ఉండకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల TSAT, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవులను ప్రభుత్వం పొడిగించడంతో మిగతా చైర్మన్లలో కూడా ఆశలు చిగురించినట్లు తెలుస్తోంది. తమ పదవులు కూడా కొనసాగుతాయనే నమ్మకంతో కొందరు ఉన్నప్పటికీ, మరి కొందరు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
కొన్ని కీలక సంస్థల చైర్మన్లకు మాత్రం పదవీకాల పొడిగింపు లభించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని TGIIC చైర్మన్‌గా కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే స్పోర్ట్స్ అథారిటీ, ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ కార్పొరేషన్ వంటి కొన్ని సంస్థల్లోనూ రెన్యువల్ అవకాశాలపై చర్చ నడుస్తోంది.
ఇప్పటికే పదవీకాలం ముగియనున్న చైర్మన్లలో పలువురికి ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వివరాలు కోరినట్లు ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కీలక పదవుల నియామకాల సందర్భంగా పోలీసు, ఇంటెలిజెన్స్ నివేదికలకు ప్రాధాన్యం ఇస్తుండగా, ఇప్పుడు రెన్యువల్ విషయంలో కూడా అదే విధానం అనుసరించే అవకాశం ఉందని సమాచారం.
పదవీకాలం ముగిసే సమయం దగ్గరపడుతుండటంతో ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు మరో అవకాశం కోసం పార్టీ పెద్దలను కలుస్తుండగా, కొత్తగా పదవులు ఆశిస్తున్న నాయకులు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో కాంగ్రెస్‌లో కార్పొరేషన్ చైర్మన్ పదవుల వ్యవహారం ఆసక్తికరంగా మారింది.



# అధికారుల నిర్లక్ష్యమే కారణం: కవిత

హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:
అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత సందర్శించారు. ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ భవనంలో ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని గత కొంతకాలంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవితకు వివరించారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, ఈ అగ్నిప్రమాదం అనూహ్యంగా జరిగిన ఘటన కాదని పేర్కొన్నారు.
భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు చోటుచేసుకున్నట్లు బాధితులు తెలిపారని ఆమె చెప్పారు. అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉందని మూడు నెలలుగా అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.
అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని కవిత విమర్శించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు.
అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక వాహనాలు గంటకు పైగా ఆలస్యంగా చేరుకోవడం బాధాకరమని అన్నారు. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే నష్టం మరింత తగ్గే అవకాశముండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ప్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అన్ని అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, భారీ భవనాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కవిత స్పష్టం చేశారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.

# పాలమూరు వెనుకబాటుతనానికి గత ప్రభుత్వమే కారణం

మహబూబ్‌నగర్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:
మహబూబ్‌నగర్ జిల్లా కరివేనలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని సాగునీరు, ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించామని, పాలమూరు భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

**పాలమూరు ప్రజలకు రుణపడి ఉన్నా**

2009లో కష్టకాలంలో తనను ఆదరించి మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను ఎప్పటికీ మరువలేనని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందని, ఈ అంశాన్ని గతంలో చట్టసభల్లో కూడా ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించానని, ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు.

**కమిషన్ల కోసం ప్రాజెక్టులు**

గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అందులో రూ.27 వేల కోట్లు పంపు లిఫ్టులకే కేటాయించి భారీ కమిషన్లు పొందిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అత్యంత కీలకమైందని, 90 టీఎంసీల నీటిని వినియోగించే సామర్థ్యం దీనికి ఉందన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్నింటికంటే ఇది పెద్దదని పేర్కొన్నారు. ఇవన్నీ సక్రమంగా పూర్తయి ఉంటే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు.
ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ కూడా చేయలేదని, కాల్వలు, రిజర్వాయర్ల నిర్మాణానికి భూములు సేకరించకుండా పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలు ఇవ్వకుండా నీళ్లు అందించడం సాధ్యం కాదన్నారు. జిల్లాలో ఇంకా నాలుగు వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని చెప్పారు.

**ఆర్థిక ఇబ్బందుల్లోనూ పనులు**



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి పనులను కొనసాగిస్తోందని సీఎం తెలిపారు. యాభై శాతం నిధులు కూడా ఖర్చు పెట్టకుండా తొంభై శాతం పనులు పూర్తయ్యాయని గత పాలకులు చెప్పారని విమర్శించారు. సివిల్ పనులు, భూసేకరణ కోసం తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు, వడ్డీల కింద రూ.52,121 కోట్లు చెల్లించామని వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టుల పాత బిల్లుల కోసం రూ.22 వేల కోట్లు విడుదల చేశామని, అందులో దాదాపు రూ.8 వేల కోట్లు పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే కేటాయించినట్లు తెలిపారు.
రాబోయే రెండేళ్లలో జిల్లాలోని పెండింగ్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు.

# పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్

- పెండింగ్ పనుల పూర్తి కోసం సీఎం కార్యాచరణ
- గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు కర్ణాటకతో చర్చలు
- పాలమూరు జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ రంగం దెబ్బతిందన్న ఉత్తమ్
- ధాన్య సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అని వెల్లడి

మహబూబ్‌నగర్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగు, తాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో ఇది కీలకమైన రోజని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని, అవసరమైన నిధులు సమకూర్చి పనులు వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులను ఇప్పుడు పూర్తి చేయకపోతే జిల్లా ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో పాలమూరు రూపురేఖలు మారుతాయని, సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని తెలిపారు.

**గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు ప్రణాళిక**

ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గూడెందొడ్డి రిజర్వాయర్‌లో 15 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలో నిర్మించిన బ్రిడ్జి బ్యారేజీల కారణంగా పెద్ద ఎత్తున నీటి నిల్వ జరుగుతోందని, ఈ అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఉమ్మడి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఖర్చులను కూడా రెండు రాష్ట్రాలు పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.
మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం ఒక టీఎంసీ నీటితో సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.
నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎస్ఆర్ఎస్పీ, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనలోనే నిర్మించబడ్డాయని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

**ఇరిగేషన్ రంగాన్ని బీఆర్ఎస్ దెబ్బతీసింది: ఉత్తమ్**

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఇరిగేషన్ రంగం తీవ్రంగా దెబ్బతిందని ఆరోపించారు. భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయని గత ప్రభుత్వం ప్రచారం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడం వల్ల భారీ నష్టం జరిగిందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనం కలగలేదని విమర్శించారు. కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు సహా పలు ప్రాజెక్టులు గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. కృష్ణా జలాల హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా నీటి వినియోగం పెరిగిందని తెలిపారు.


**ధాన్య సేకరణలో తెలంగాణ అగ్రస్థానం**

ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 71.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గతంతో పోలిస్తే 60 శాతానికి పైగా అధిక ధాన్యం సేకరించామని చెప్పారు. వరి ఉత్పత్తి, ధాన్య సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. రైతులకు మద్దతుగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

మొదటిపేజీ తరువాయి

లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్షించారు. 2026 27కు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చామని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా నగరానికి 3040 కి.మీ దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతోపాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని చెప్పారు. ఫలితంగా ఆ గృహాలు నిరుపయోగంగా మిగిలాయన్నారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం చేయకుండా పేదలు



ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్‌లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

మొదటిపేజీ తరువాయి

హెచ్ఎండీఏకు కేటాయించిన భూముల సరిహద్దులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని రాతిగుట్టల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న పర్యావరణ సంస్థల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
రెవెన్యూ రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లలో 293 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, వివిధ కేటాయింపులు, భూ వివాదాల అనంతరం సుమారు 200 ఎకరాల భూమి హెచ్ఎండీఏ పరిధిలో మిగిలింది. ఈ ప్రాంతంలో విలువైన చారిత్రక రాతిగుట్టలు, సహజ శిలా నిర్మాణాలు ఉండటంతో వాటి పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు.
పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఈ రాతిగుట్టలకు సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ శిలా నిర్మాణాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అరుదైన భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. వీటి సంరక్షణ ద్వారా ప్రకృతి వారసత్వాన్ని కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.
హైడ్రా చర్యలను పర్యావరణ సంస్థల ప్రతినిధులు స్వాగతించారు. సహజసిద్ధమైన కొండలు, రాతి నిర్మాణాలు, పచ్చదనాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.
ఈ ప్రాంతానికి సమీపంలోని భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఎత్తైన కొండలు, సహజ రాతిగుట్టలు, చెరువు సమన్వయంతో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని స్థానికులు, పర్యావరణవేత్తలు భావిస్తున్నారు.
ప్రభుత్వ భూములు, ప్రకృతి సంపద, చారిత్రక వారసత్వ పరిరక్షణలో హైడ్రా చేపట్టిన ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.





# రూ.1600 కోట్ల విలువ చేసే బొగ్గు మాయం

**మొదటిపేజీ తరువాయి**

మొదలుకుని వందల అక్రమాల విషయంలో కేంద్రం నుంచి స్పందన లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈమేరకు ఆయన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. ఎప్పటికప్పుడు నిల్వలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ కానీ, కాగ్ అధికారులు కానీ ఇప్పటిదాకా ఎందుకు తనిఖీలు చేపట్టలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి మనుగడనే దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస స్కాంలతో వణికిపోతున్న సింగరేణిలో రూ.1600 కోట్లు విలువ చేసే బొగ్గు మాయం చేసి సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీశారని ఆరోపించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల స్కామ్ జరగడం సంస్థ మనుగడనే ప్రమాదంలోకి నెడుతోందన్నారు. సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించకపోవడం ఈ కుంభకోణాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు మీద కోల్ సెస్ తోపాటు, ఇన్ కమ్ టాక్స్ కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉందో తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం1 లో ఆరు లక్షలు, రామగుండం2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 .40 లక్షలు, ఇల్లందులో 3.50 లక్షలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు.. కానీ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ లోనే గనుల వద్ద నిల్వలను తనిఖీ చేసే గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం, చివరికి కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిలపక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణమే కాక ఇటీవల బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన నైని బొగ్గు గని టెండర్ల స్కాం కూడా దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిందన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి సింగరేణిని కబళించేందుకు సీఎం రేవంత్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే నిబంధన పెట్టి కోరుకున్న వారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలుచేశారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని తెలినా ఇప్పటిదాకా దీనిపై మీరు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

**అక్రమార్కుల భరతం పట్టే దిశగా అడుగు వేయలేదు**

నైని కోల్ స్కామ్ ను బీఆర్ఎస్ బయటపెట్టగానే ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియను రద్దుచేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు తప్ప టెండర్లలో అక్రమార్కుల భరతం పట్టే దిశగా ఒక్క అడుగు వేయలేదన్నారు. టెండర్ పోటీదారులను బెదిరించి, భయపెట్టి ప్రక్రియ నుంచి తప్పించే పన్నాగాలు సాగినా దీనికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదు. ఈ టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడానికి కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకూ ఏం తేల్చిందో కూడా పత్తాలేదు. నైని కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు మొద్దునిద్ర పోతోందో సింగరేణి కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు.గతంలో నైని స్కామ్ తోపాటు.. 107 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల నిబంధనలకు పాతరేసి నేషనల్ యావరేజీని కూడా మించి అత్యధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి నేరుగా డీజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్థాంతరంగా రద్దుచేసి అందులోనూ దోపిడీకి తెరలేపారు. అలాగే పేలుడు పదార్థాల కొనుగోళ్లలోనూ కోల్ ఇండియా కంటే 30 శాతం అధిక నిధులు చెల్లించి అనుయాయులకు కట్టబెట్టారు. అంతే కాకుండా చివరికి మెస్సీతో ముఖ్యమంత్రి ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ.110 కోట్ల సింగరేణి నిధులను దుర్వినియోగం చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇలా వరుస కుంభకోణాలు జరుగుతున్నా అక్రమార్కుల భరతం పట్టకుండా కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం వెనక కాంగ్రెస్‌బీజేపీ చీకటి ఒప్పందాలే కారణమని కార్మికులకు అర్థమైపోయిందన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమ దందాలను వెలుగులోకి తెచ్చేందుకు చివరికి ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా వివరాలు బయటకు పొక్కకుండా దుష్టశక్తులు అడ్డుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన రూ.1600 కోట్ల సింగరేణి బొగ్గు కుంభకోణంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కార్మికుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణంపై ఒకవేళ మీరు విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

## నిధులు, నియామకాలు, నీళ్లలో విఫలం

**మహబూబాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హా పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ డియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

గండిపేట ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు జరిగిన కుట్ర కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం, గండిపేట పరిధిలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ పత్రాలను సృష్టించి భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడు కీలక పాత్ర పోషించినట్లు గుర్తించిన దర్యాప్తు బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. భూకబ్జా ప్రయత్నంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకునేందుకు నకిలీ పత్రాలను వినియోగించడం తీవ్రమైన నేరమని పోలీసులు పేర్కొన్నారు. భూముల వ్యవహారాల్లో మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల కొనుగోలు సమయంలో ప్రజలు సంబంధిత రికార్డులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, నకిలీ పత్రాల వినియోగానికి సంబంధించిన కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలను గుర్తించి అడ్డుకునేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని, భూముల అక్రమ బదిలీలు, నకిలీ పత్రాల తయారీ వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రను కూడా వెలికితీస్తామని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణానికి రైల్వే బోర్డు 'నో'

- **ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తిరస్కరించిన బోర్డు**

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ నగర ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణాన్ని తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు రైల్వే బోర్డు నుంచి చుక్కెదురైంది. జూన్ 2 నుంచి ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను రైల్వే బోర్డు శుక్రవారం తిరస్కరించింది. ఇప్పటికే తాము భారీ నష్టాల్లో నడుస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత ప్రయాణాలు సాధ్యం కాదని స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాసింది. రైల్వే అధికారులు పంపినఎంఎంటీఎస్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని లెక్కలతో సహా వివరించారు. సర్వీసుల నిర్వహణ వల్ల కేవలం ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.160 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన రూ.490 కోట్ల పాత బకాయిలను కూడా ఇంకా చెల్లించలేదని రైల్వే బోర్డు లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని భావిస్తే.. దానికి సంబంధించిన పూర్తి ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఎంఎంటీఎస్ వ్యవస్థకు వచ్చే నష్టాల మొత్తాన్ని 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే.. ఆ ప్రతిపాదనకు తాము అంగీకరిస్తామని రైల్వే అధికారులు తేల్చిచెప్పారు.

## చెరువులతో నగరానికి జీవకళ తెద్దాం

- **ప్రకృతిని పరిరక్షించుకుందామంటూ హైడ్రా ప్రచారం**
- **ముఖ్యమైన కూడళ్లలో ప్లకార్డులను ప్రదర్శించిన హైడ్రా**
- **హైడ్రా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణదినోత్సవం**




**తెలంగాణ బ్యూరో ,జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

గొలుసుకట్టు చెరువులను కాపాడుకుందాం.. చెరువులతో నగరానికి జీవకళ తీసుకువద్దాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం.. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమౌదాం అంటూ నగరంలో హైడ్రా నినదించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ముఖ్యమైన కూడళ్లు, క్రీడామైదానాలు వద్ద ప్రకృతి పరిరక్షణపై చైతన్య కార్యక్రమాన్నిహైడ్రా చేపట్టింది. ట్రాఫిక్ పోలీసులు, ఐటీ ఉద్యోగులు, చిన్నారులు, నగర ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై భవిష్యత్ నగరానికి బాటలు వేశారు. మన చెరువులు మన భవిష్యత్.., హైడ్రాతో కలసి చెరువులను పరిరక్షించుకుందాం, సేవ్ వాటర్ సేవ్ లైఫ్, పర్యావరణంతో మెరుగైన జీవితం అంటూ నినదించారు. బాలాపూర్ చౌరస్తా, అమీర్‌పేటలోని మైత్రివనం, ఆరాంఘర్ చౌరస్తా, కర్బలా జంక్షన్, ఎల్.బి.నగర్త, హైటెక్‌సిటీ, గోల్కొండ, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. హైడ్రా ఆర్ ఎఫ్‌వో శ్రీ జయప్రకాష్, డీఆర్ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పరిశుభ్రమైన పరిసరాల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూమిని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే నీటి వనరులను కాపాడుకోవడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి అందరూ భాగస్వాములు కావాలని హైడ్రా అధికారులు కోరారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

## పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

- **తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసుల ఛేదన**
- **ప్రధాని, కేంద్ర హోంమంత్రి పర్యటనలకు విజయవంతమైన బందోబస్తు**
- **ట్రాఫిక్, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధక విభాగాల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి నెలలో చేపట్టిన చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలు కీలక అంశాల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసులను ఛేదించామని డీజీపీ తెలిపారు. నేరాల దర్యాప్తులో వేగం పెంచి నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టే దిశగా పోలీసు శాఖ సమర్థంగా పనిచేసిందని చెప్పారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి రాష్ట్ర పర్యటనల సందర్భంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. భారీ స్థాయిలో బందోబస్తు చేపట్టడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బక్రీద్ పండుగను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసిందని వివరించారు. రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొత్త విభాగాల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేశామని సీవీ ఆనంద్ తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, విజిలెన్స్ అమలు, ఆహార కల్తీ నిరోధక చర్యల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనపై కసరత్తు జరుగుతోందన్నారు. ప్రజా సమస్యలకు మరింత సమర్థవంతంగా స్పందించడమే ఈ ప్రతిపాదనల ప్రధాన లక్ష్యమని చెప్పారు. పోలీసు శాఖలో సిబ్బంది వినియోగం, అవసరాలపై సమగ్ర అంచనా వేసేందుకు సిబ్బంది ఆడిట్ ప్రక్రియను ప్రారంభించామని డీజీపీ వెల్లడించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా సేవల నాణ్యతను పెంచేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అవసరమైన చోట సిబ్బంది బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర ప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన, వేగవంతమైన స్పందన ద్వారా తెలంగాణ పోలీసు శాఖను మరింత ప్రజామిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణకు కూడా ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు

## ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి


**హైదరాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్‌వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్‌వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డేను పురస్కరించుకుని ఈ ఆదివారం (7వ తేదీ)రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫఎసఎసఏఐ) మార్గదర్శకాల ప్రకారం వీరు శిక్షణ ఇస్తారు. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

## ఎండను లెక్కచేయకుండా.. విశాఖ రోడ్లపై సీఎం చంద్రబాబు సైకిల్ సవారీ

**విశాఖపట్నం, ఆశ్వి అప్డేట్స్**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో సైకిల్ సవారీ చేశారు. నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో పూర్తి చేశారు.



ఈ సైకిల్ యాత్ర ఏయూ గ్రౌండ్స్‌లో ప్రారంభమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్ హోటల్ వద్ద ముగిసింది. ర్యాలీ సమయంలో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ, చంద్రబాబు ఏమాత్రం అలసట లేకుండా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ తొక్కారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని నిర్వహించారు.

# ప్రజలకు ఉపాధి కల్పనే నిజమైన అభివృద్ధి

**సిద్దిపేట, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్:**

సిద్ధిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వితీయ ఎంటర్‌ప్రైజెస్ దుస్తుల తయారీ పరిశ్రమను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు, కళాశాలలు నిర్మించడం మాత్రమే కాదని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమేనన్నారు. సిద్దిపేట మహిళలకు, గృహిణులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే తన కల టెక్ లైన్, అద్వితీయ సంస్థల సహకారంతో నేడు సాకారమవుతోందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యూనిఫామ్‌ల తయారీ ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్న టెక్ లైన్ సంస్థ అధినేత్రి భువనేశ్వరి సేవలను కొనియాడారు. లాభాపేక్ష కంటే ఉపాధి కల్పనకే ప్రాధాన్యతనిస్తూ ప్రశాంత్ నగర్‌లో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన కోఆపరేటివ్ చైర్మన్ తోట శ్రీకాంత్ రెడ్డి బృందాన్ని అభినందించారు. ఈ పరిశ్రమలో 70 మంది మహిళలు పనిచేస్తున్నారని, త్వరలోనే స్టిచ్చింగ్ విభాగంలో 100 మంది, ప్యాకింగ్ విభాగంలో మరో 100 మంది మహిళలకు ఉపాధి లభించనుందని తెలిపారు. సాధారణంగా నెల రోజుల సమయం పట్టే శిక్షణను సిద్దిపేట మహిళలు కేవలం నాలుగు రోజుల్లోనే నేర్చుకోవడం వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. మహిళలంతా నాణ్యతతో కూడిన పనితీరును కనబరిస్తే మరిన్ని ఆర్డర్లు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు 200 నుంచి 400, అనంతరం 800 మందికి విస్తరించే అవకాశం ఉందని వివరించారు.గతంలో సిద్దిపేటలో 6 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించినప్పటికీ అవి గృహ స్థాయికే పరిమితమయ్యాయని, కానీ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే అద్వితీయ సంస్థలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. మహిళల శ్రమ, క్రమశిక్షణ, నాణ్యత ఆధారంగానే భవిష్యత్తులో సిద్దిపేట దేశంలో రెండో షోలాపూర్‌గా ఎదిగే అవకాశం ఉందన్నారు. సంస్థ విస్తరణ కోసం ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో తానే స్వయంగా మాట్లాడి మరిన్ని ఆర్డర్లు వచ్చేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. దేశంలోని సుమారు రూ.60 వేల కోట్ల టెక్స్‌టైల్ పరిశ్రమలో 70 శాతం వాటా స్టిచ్చింగ్ రంగానిదేనని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వలిగొండ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

- ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆకస్మిక తనిఖీ
- రికార్డులు, రిజిస్టర్లు క్షుణ్ణంగా పరిశీలన
- సిబ్బంది యూనిఫాం, లాకప్ CCTV, సైబర్ కేసులపై ప్రత్యేక దృష్టి

**ఆశ్వ అప్డేట్స్ క్రైమ్ బ్యూరో :**

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పనితీరు మెరుగుపరిచేందుకు జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్, IPS గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు.
తనిఖీ వివరాలు: ముందుగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యూనిఫాం ధరించే విధానం, వారి వ్యక్తిగత సామగ్రి ఉండే పెట్టెలను తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాన్ని సందర్శించారు.
రికార్డుల పరిశీలన: స్టేషన్ లోపల జనరల్ డైరీ పరిశీలించిన అనంతరం హెల్ప్ డెస్క్ విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీని చెక్ చేసి విధులపై విచారించారు. కోర్టు రికార్డు గది తనిఖీ చేసి ఎవిడెన్స్ ప్రాపర్టీని ఆర్డర్‌లో పెట్టుకోవాలని ఆదేశించారు.
పెండింగ్ కేసులపై ఆదేశాలు: పిటిషన్ పెండింగ్, రిజిస్టర్డ్ పిటిషన్లను ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డుల్లో పొందుపరచాలని ఎస్పీ ఆదేశించారు. CCTNS, CISR పోర్టల్ పని తీరును పరిశీలించి, సైబర్ నేరాల పాత కేసుల వివరాలను కంప్యూటర్లో చెక్ చేశారు.
లాకప్, రౌడీ షీటర్లు: లాకప్ రూమ్ తనిఖీ చేసి అందులోని CCTV పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్ల రికార్డులు పరిశీలించి వారి ప్రవర్తన గురించి ఆరా తీశారు.
రికవరీ వాహనాల తనిఖీ: పోలీస్ స్టేషన్ బయట గల రికవరీ వాహనాలను పరిశీలించి, వాటిపై క్రైమ్ నెంబర్ వేసి నేరాల నెంబర్ ఆధారంగా ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు.
పాల్గొన్న అధికారులు: ఈ తనిఖీలో చౌటుప్పల్ జోన్ డిఎస్పి మధుసూదన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ యుగేందర్ *గౌడ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## నాటిన ప్రతి మొక్కని వృక్షంగా తీర్చిదిద్దాలి

**ఆశ్వ అప్డేట్స్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో, జిల్లా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జ్ శ్రీ ఎం. నాగరాజు గారితో కలిసి జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొని మొక్కలు మొక్కలు నాటడం జరిగింది..
ఈ సందర్భంగా జిల్లా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జ్ శ్రీ ఎం. నాగరాజు గారు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి మరియు రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడుకుంటూ వృక్షాలుగా మార్చాలని పిలుపునిచ్చారు.
మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా పెంచాలని ఆమె కోరారు. పోలీస్ శాఖ తరపున పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా హరితహారాన్ని, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఇతర న్యాయమూర్తులు, అటవీ శాఖ అధికారులు మరియు పాల్గొన్నారు.



## వికారాబాద్ కోర్టులో పర్యావరణ దినోత్సవం మొక్కలు నాటిన న్యాయమూర్తులు, ఎస్పీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆశ్వ అప్డేట్స్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, ఎస్పీ స్నేహ మెహ్రా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.
ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత అని న్యాయమూర్తి నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శాంతి లత, అదనపు జూనియర్ న్యాయమూర్తి వైష్ణవి, అటవీశాఖ అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు లవకుమార్, వసుందర, వెంకట్ రెడ్డి, చీఫ్ న్యాయవాది టి. వెంకటేష్, న్యాయవాదులు రాము, కమల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నాగరాజు, రాజు, రాజశేఖర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు..

- జాతీయ రహదారి వెంట హోటల్స్, దాబాలు, విద్యాసంస్థల్లో తనిఖీలు.

**అశ్వి అప్డేట్స్ తెలంగాణ బ్యూరో:**

జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది ఈరోజు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని ఎస్సై తెలిపారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, జాతీయ రహదారి వెంట హోటల్స్ దాబాలు, పాన్ డబ్బాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**గజ్వేల్ జున్ 05, (ఆశ్వి అప్డేట్స్)**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గజ్వేల్ సిఐ రవి కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు ప్రతి ఒక్కరు ఒక మొక్క' నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## పర్యావరణాన్ని ప్రేమించాలి మొక్కలు నాటాలి ట్రాఫిక్ సిఐ

**గజ్వేల్ జున్ 05, (ఆశ్వి అప్డేట్స్)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పూర్వకాలంలో చెట్లు, అడవులు అధికంగా ఉండటంతో సమృద్ధిగా వర్షాలు కురిసేవని, ప్రస్తుతం చెట్ల నరికివేత పెరగడం వల్ల వర్షపాతం తగ్గి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం కనీసం పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై జగదీశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు



## రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- ప్రభుత్వానికి ఎంత చెప్పినా చెవికెక్కడం లేదు.
- రైతులకు ఇన్ని కష్టాలు వచ్చినా ఎమ్మెల్యే కనిపించడం లేదు.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి

**రామాయంపేట, జూన్ 5**
**ఆశ్వి అప్డేట్స్...**

భారీ వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం మండల నాయకులు, రైతులతో కలిసి మెదక్ సిద్దిపేట హైవే పైన రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 లారీల ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని రైతులు తమకు వివరించారని తెలిపారు.శుక్రవారం కురిసిన భారీ వర్షంతో 2 కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.రైతులకు ఇంతటి కష్టాలు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే కనిపించడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు కూడా ఎమ్మెల్యే ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి మాదిరిగానే ఎమ్మెల్యే కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మరో రెండు రోజుల్లో మృగశిర కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీంతో ధాన్యం పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు.తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.లారీల కొరత, కూలీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైస్‌మిల్లర్లు సంచికి అదనంగా ఐదు కిలోల ధాన్యం వేస్తేనే తీసుకుంటామని చెప్పడం వల్ల రైతులు క్వింటాలుకు 12 కిలోల వరకు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన లారీలను పంపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే. చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్,నిజాంపేట్ ఎంపీపీ సంపత్,సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాతారావు,మాజీ సర్పంచ్ నర్స గౌడ్, మాజీ ఎంపీటీసీ సత్యం ,బిక్షపతి,నాయకులు ఉమామహేశ్వర్,అబ్దుల్ అజీజ్, హస్నొద్దీన్,రొయ్యల నవీన్, మధుకర్ రాంకీ శ్రావణ్, మహేష్, రంజిత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.







## వెల్దుర్తి పోలీసుల సింహస్వప్నం వృద్ధురాలిని దోచిన ముఠా అరెస్ట్

- చాకచక్యంగా కేసును ఛేదించిన సిఐ వెంకట్రాజ గౌడ్ బృందం

**తూప్రాన్, జూన్ 05**
**( ఆశ్వి అప్డేట్స్ )**

అభాగ్యులపై పడి దోచుకునే దొంగల ఆట కట్టించారు వెల్దుర్తి పోలీసులు. ఒంటరి మహిళే లక్ష్యంగా చేసుకొని, కత్తితో బెదిరించి బంగారు కమ్మలు అపహరించిన ఇద్దరు నిందితులను వెల్దుర్తి పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, పక్కా నిఘాతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితులను జైలు గూటికి చేర్చారు.

**ఆటో ఎక్కించి.. అడవిలోకి తీసుకెళ్లి....**

మే 30న వెల్దుర్తి మండలం రామాయిపల్లి కి చెందిన రాపర్తి రాజమ్మ (70) వృద్ధురాలు వెల్దుర్తి పరిసర ప్రాంతంలో ఆటో ఎక్కారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఉన్న ఆటో డ్రైవర్లు ఆమెను బస్వాపూర్ గ్రామ శివార్లలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ వృద్ధురాలని కత్తితో బెదిరించి, ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల పక్కా ప్లాన్..**
**బ్రిడ్జి వద్ద దొరికిన దొంగలు**

బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీఐ వెంకటరాజా గౌడ్ ఆధ్వర్యంలోని వెల్దుర్తి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం తూప్రాన్ లోని నర్సాపూర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు, నిఘా నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల మార్క్ విచారణతో నిందితులు తలవంచక తప్పలేదు. తామే ఆ వృద్ధురాలిని బెదిరించి బంగారం దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొత్తూరు గ్రామంలోని కృష్ణ జ్యువెలరీ షాపులో విక్రయించి నగదు పంచుకున్నట్లు అంగీకరించారు. నేరానికి ఉపయోగించిన ఆటో ను దొంగిలించిన బంగారు చెవి కమ్మలు కొత్తూరులోని కృష్ణ జ్యువెలరీ షాప్ నుండి రికవరీ చేశారు నిందితులు మద్దూరి శ్రీకాంత్, ఎండి శైలానిల ను రిమాండ్ కు తరలించారు.

**ముఖ్య పాత్ర పోషించిన సీఐ వెంకట్రాజా గౌడ్...**

ఈ కేసును ఛేదించడంలో తూప్రాన్ సిఐ ఆశయం వెంకట్రాజా గౌడ్ అత్యంత ప్రతిభను కనబరిచారు. కేసు నమోదైన వెంటనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి, నిందితుల కదలికలపై నిఘా పెట్టడంలో ఆయన చాకచక్యం, లీడర్‌షిప్ అమోఘం. సిఐ వెంకట్రాజా గౌడ్ పర్యవేక్షణలో వెల్దుర్తి ఎస్ఐ జ్యోతి, పోలీస్ సిబ్బంది గోవర్ధన్ రావు,కృష్ణ, సురేష్, మహేష్‌లు కృషిచేసి నిందితులను పట్టుకున్నారు.

**డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రశంసల జల్లు.....**

తక్కువ సమయంలోనే కేసును ఛేదించి, రికవరీ చేసిన తూప్రాన్ సిఐ వెంకట్రాజా గౌడ్ అండ్ టీమ్‌ను తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవకు గానూ ఈ బృందానికి త్వరలోనే తగిన రివార్డులు అందజేస్తామని ఆయన ప్రకటించారు. పోలీసుల ఈ మెరుపు దాడిపై స్థానిక ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బేకరీలో చోరీ.. నగదు, ల్యాప్‌టాప్‌తో ఉడాయించిన దొంగలు

**ఆశ్వి అప్డేట్స్ జూన్ (5)మేడ్చల్ :**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి హౌసింగ్ బోర్డ్‌లోని ఎస్ఎస్ బేకరీలో బుధవారం అర్ధరాత్రి జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. దొంగలు బేకరీ వెనుక వైపు నుంచి ప్రవేశించి తాళాలు పగులగొట్టి లోపలికి చేరి నగదు, ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర వస్తువులను అపహరించారు.ఈ ఘటన పై బేకరీ యాజమాన్యం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేపట్టారు. ప్రధాన రహదారిపై, ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న ఎస్ఎస్ బేకరీలో చోరీ జరగడం స్థానిక వ్యాపారులు, ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



## 500 మంది పోలీసుల మెరుపు దాడి.. ఉలిక్కిపడ్డ స్పా సెంటర్ల నిర్వాహకులు

**హైదరాబాద్, జూన్05, ఆశ్వి అప్డేట్స్:**

నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు.
స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. ఈ సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం అనే చర్చ నడుస్తుంది. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు..



# ఓటర్ జాబితా సమగ్ర సవరణ

- పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి అధికారులకు ఆదేశాలు.

**ఆశ్వి అప్డేట్స్ రంగారెడ్డి జిల్లా జూన్ 05 :**



ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.
శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డితో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి SIR పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు వాటిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు తుది జాబితాలో ఉండకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరునామా మార్పులు, వివరాల సవరణలు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఇంటింటి గణన సందర్భంగా ఫారం 6 మరియు డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లు వివరాల పరిశీలన, ఫారాల పూరణకు టోల్ ఫ్రీ నంబర్ 1950, ఓటర్ పోర్టల్ మరియు ఈసీఐ నెట్ (ECINET) యాప్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సరిత, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణం ఒక్క రోజు ముచ్చట కాదు

- ప్రతి రోజూ పాటించాల్సిన దీక్ష
- మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జలంధర్ గౌడ్
- మన భూమి - మన బాధ్యత నినాదంతో పచ్చదనం వైపు అడుగులు.

**సికింద్రాబాద్, జూన్ 5, ఆశ్వి అప్డేట్స్ :**




పర్యావరణం ఒక్క రోజు ముచ్చట కాదు. ప్రతి రోజూ పాటించాల్సిన దీక్ష అని మనం వేసే ప్రతి అడుగు భూమాతకు
ఊపిరిపోసినట్లేనని మక్తాల ఫౌండేషన్ గ్రీనరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్ అన్నారు. శుక్రవారు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలోని మక్తాల ఫౌండేషన్ కార్యాలయం వద్ద మొక్కలు నాటి అనంతరం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జలందర్ గౌడ్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి. నిర్వహిస్తుందని. ఈ సంవత్సరం భూ పునర్వరణ ఎడారీకరణ, కరువును తట్టుకునే సామర్థ్యం నేపథ్యంలో నేలను కాపాడుకుందాం భవిష్యత్తును నిలబెట్టుకుందాం అనే నినాదంతో నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం నగరంలో మొక్కలు నాటడానికి స్థలం లేనందువల్ల కనీసం బకెట్లలో అన్న మొక్కలను నాటాలనే ఆలోచనకు రూపాంతరం చేస్తూ మొక్కలను పెంచుతూ భూతాపాన్ని తగ్గించడంలో మా వంతు కృషిని నిర్వహిస్తున్నామని వివరించారు. అడవుల నరికివేత. కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వల్ల భూమి రోజురోజుకూ వేడెక్కుతోందని, ప్రస్తుతం 42డిగ్రీల సెల్సియస్ నుండి 45డిగ్రీల సెల్సియెస్ ఉన్న ఉష్ణోగ్రతలు భవిష్యతు లో 50 డిగ్రీల సెల్సియెస్ దాటే ప్రమాదం ఉందని, తెలంగాణలో దాదాపు 30% భూమి ఏదో రకంగా క్షీణిస్తుందని చెట్ల నరికివేత, రసాయన ఎరువుల వాడకం. నీటి వృదా వల్ల భూసారం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పుడే మేల్కోనకపోతే భవిష్యత్ తరాలు ఎడారిలో బతకాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విపత్తును ఆపాలంటే పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. ఇంకుడు గుంతలు, వాననీటి నిల్వ చేపట్టాలని సింగిల్ యూజ్ ప్లాస్లకు పూర్తిగా దూరంగా ఉండాటని తడి పొడి చెత్త వేరు చేసి కంపోస్టు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

**12వ రోజు మజ్జిగ పంపిణీ....**

ముక్తాల పౌండేషన్ గత 12 రోజులుగా పాదచారులకు, వాహనదారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తూ, వేడి తీవ్రతకు గల కారణం చెట్లు శాతం తగ్గడమేనని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎండలు తగ్గే వరకు మజ్జిగ సేవ కొనసాగిస్తూ, వర్షాకాలం ప్రారంభం కాగానే భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని ప్రతి పౌరుడు బాధ్యతగా ఒక మొక్క నాటితే ఏసీలు, డాలర్లు అక్కర్లేదని ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, పాఠశాలలు అందరూ కదలాలని మజ్జిగతో నేటి దాహాన్ని తీర్చాం. మొక్కలతో రేపటి ప్రాణం నిలబెడదామని జలంధర్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో హరికుమార్, ప్రసన్న కుమార్, వేణు, శ్రీధర్ గౌడ్, ప్రకాష్, వేణుగోపాల్, వెంకట మోహన్, మదు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు..

## ఆసరా పెన్షన్ల దరఖాస్తులపై స్పష్టతనిచ్చిన డి.ఆర్.డి.ఓ

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట, జూన్ 5**

జిల్లాలో ఆసరా పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై నారాయణపేట డి.ఆర్.డి.ఓ ఎన్. వెంకట రాములు కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి కొత్త దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎటువంటి అధికారిక ఆదేశాలు అందలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీసేవ కేంద్రాల్లో ఆసరా పెన్షన్ల నమోదు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. కావున, ఆన్లైన్ దరఖాస్తుల కోసం ప్రజలు మీసేవ కేంద్రాలకు వెళ్లి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఆయన సూచించారు. అదే సమయంలో, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు



గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. తమ పరిధిలో ఎవరైనా అర్హులైన వారు పెన్షన్ల కోసం స్వచ్ఛందంగా దరఖాస్తులు సమర్పించినట్లయితే, వాటిని స్వీకరించి భద్రపరచాలని తెలిపారు.

## అమ్మ పేరిట ఒక్క మొక్క(ఎక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమం

**అశ్వి అప్డేట్స్ జూన్-05,మేడ్చల్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రి లో మొక్కలు నాటారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన విజయోత్సవాల సందర్భంగా అమ్మ పేరిట ఒక్క మొక్క(ఎక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమం నిర్వహించమన్నారు.ప్రతి ఒక్కరు వాళ్ళ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి ప్రకృతి కి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు.నరేంద్ర మోదీ నాయకత్వం లోదేశం గత 12సంవత్సరాలుగా అభివృద్ధి,సంక్షేమం,మౌలిక వసతులు,జాతీయ భద్రతమహిళ సాధికారత తదితర రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు



# హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన "థ్రెడ్ పోచంపల్లి"

- తెలంగాణ ప్రసిద్ధ ఇకత్ వారసత్వానికి అద్భుత వేదిక

**ఆశ్వి అప్డేట్స్ హైదరాబాద్ జూన్ 05 :**

తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనను హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హాల్ 4లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు, చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమం తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమై సందర్శకులను ఆకట్టుకుంది. ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతల చేత రూపొందించిన అద్భుత హస్తకళాఖండాలు, సహజ రంగులు మరియు వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.
ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ఆ అనుభూతిని పొందే అవకాశం కల్పించారు. ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరిస్తూ ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు.
100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహ అలంకరణ ఉత్పత్తులు, జీవనశైలి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి.
పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. తెలంగాణ టూరిజం శాఖ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై, పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది. వీటి ద్వారా సందర్శకులు నేరుగా నేత కుటుంబాలను కలుసుకుని, సంప్రదాయ మగ్గాల పనితీరును వీక్షించే అవకాశం పొందనున్నారు.
ఈ సందర్భంగా మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి, అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు.
పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లు సందర్శకులకు సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తున్నాయి.
యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7, 2026 వరకు కొనసాగనుంది.
తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి మరియు ప్రోత్సహించడానికి ఇది అరుదైన అవకాశంగా నిలవనుంది.










# బినామీ లావాదేవీలు చట్ట విరుద్ధం

- ఏడేళ్ల శిక్ష తప్పదు అదనపు ఐటి కమీషనర్ శ్రీకాంత్ రెడ్డి

**సికింద్రాబాద్, జూన్ 05 :**

బినామి లావాదేవీలు చేయడం చట్టవిరుద్ధమని. అలాంటి ఆస్తులను ఎలాంటి నష్టపరిహారం లేకుండా కేంద్ర ప్రభుత్వం జప్తు చేస్తుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ వై.శ్రీకాంత్రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సికింద్రాబాద్ లోని ఓ హోటల్లో తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో భారతదేశంలో బినామీ చట్టం పాటించడం దర్యాప్తు & తీర్పు అనే అంశంపై సదస్సు జరిగింది. చార్టెడ్ అకౌంటెంట్ సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... 2016లో మోదీ ప్రభుతత్వం బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ సవరణ చట్టం 2016గా తీసుకొచ్చిందని తెలిపారు. నల్లధనాన్ని వ్యతిరేకంగా కేంద్రం చేస్తున్న పోరాటంలో ఈ చట్టంలో పాటు నల్లదనం వెల్లడిం చనివిదేశీ ఆదాయం, ఆస్తులు పన్ను విధింపు చట్టం, 2015 మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే వాస్తవ యజమాని, బినామీదారు ఇద్దరికే ఏడేళ్ల వరకు కఠిన జైలు శిక్షతో పాటు బినామీ ఆస్తి మార్కెట్ విలువలో 25% వరకు జరిమానా విధిస్తారని స్పష్టం చేశారు. బినామీ ఆస్తులను తిరిగి పొందేందుకు అసలు యజమానులు కోర్టులో దావాలు కూడా వేయలేరని తెలిపారు. పౌరులు పన్నులు సకాలంలో చెల్లించాలని బినామీ ఆస్తిని స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలని లేకుంటే సర్వం కోల్పేయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అసోసియేషన్ అధ్యకులు సీఏ చంద్ర శేఖర్ వేముల మాట్లాడుతూ... బినామీ లావాదేవీలను అరికట్టేందుకు చార్టర్డ్ అకౌటెంట్లు పూర్తి సహకారం అందిస్తారిని తెలిపారు. ఆస్తి పత్రాల ఆడిట్లో అసాధారణ విషయాలు గుర్తిస్తే వెంటనే పన్ను అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. కుటుంబ సభ్యుల మధ్య తెలియకుండానే కొన్ని బినామీ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని, అన్ని ఆర్థిక లావాదేవీలకు ఆడిటర్ల సలహా తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సదస్సులో అసోసియేషన్ కార్యదర్శి అశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు. రామ్ దేవ్ బుటాడా, కాంపిటేషన్ కమిటీ ఛైర్మన్ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు పి.వి. నారాయణ రావు, మాజీ అధ్యక్షులు హితేష్ జైన్, పూర్ణచంద్ర రావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రమణ రెడ్డి, ప్రవల్లిక వేముల, ప్రకాష్ చోకదా, వెంకట్రామ్, శైలేంద్ర శర్మ, లీల కృష్ణ మోహన్, ఎన్వి. దారి, అజయ్ వాల్వే, దహిమా తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి పొన్నం ప్రభాకర్

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

ప్రపంచమే ఒక కుగ్రామంగా మారుతున్న తరుణంలో పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటడమే కాకుండా, 'చెట్టు విలువ తెలుసా' అనే పోస్టర్‌ను ఆవిష్కరించి, అందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఢిల్లీ తరహా కాలుష్య దుస్థితి తెలంగాణకు రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రాష్ట్రంలో సున్నా టాక్స్‌తో ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) పాలసీని తీసుకువచ్చారని తెలిపారు. మొక్కలు నాటడం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, అందరి జీవితాల్లో భాగం కావాలన్నారు. రాష్ట్రంలో నిర్మించే 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో మొక్కల పెంపకం పర్యవేక్షణకు ఐదుగురు సభ్యుల కమిటీలను వేశామని, కోతుల సమస్య నివారణకు పండ్ల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
ఉత్తమంగా మొక్కలు నాటిన గ్రామాల సర్పంచులను అభినందిస్తామని, పర్యావరణం, స్వచ్ఛత కోసం మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులు, హోటళ్లకు గ్లాసులు పంపిణీ చేశామని తెలిపారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అవార్డు అందుకోవడం గర్వకారణమన్న మంత్రి, అందరూ 'ప్రకృతి రక్షకులుగా' మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమావతి, సీపీ రష్మీ పెరుమాళ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి...

- స్థానిక సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి

**చిన్న శంకంపేట జూన్ 5**
**ఆశ్వి అప్డేట్స్...**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గ్రామాల అభివృద్ధి కోసం గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గ్రామ సర్పంచ్ ఆవుల గోపాల్ రెడ్డి అన్నారు. చిన్న శంకరంపేట మండలం జంగారై గ్రామంలో స్థానిక సర్పంచ్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ గ్రామ సభ కార్యక్రమంలో భాగంగా గ్రామ అభివృద్ధి పై గ్రామస్తులతో చర్చించారు, గ్రామ సమస్యలను తెలుసుకున్న ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని, గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని, సర్పంచ్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ రెడ్డి తో పాటు ఉప సర్పంచ్ మహేష్, పంచాయతీ కార్యదర్శి పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకులకు ప్రాచుర్యం కల్పించాలి...

- మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి
- జిల్లావ్యాప్తంగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట ప్రణాళిక
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**రామాయంపేట జూన్ 5 ఆశ్వి అప్డేట్స్.**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు.

అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటాలని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం. అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది అన్నారు.మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడానికి ఒక్క క్షణం కేటాయించాలని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని, ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సంరక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు. జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్ జోహారీ మాట్లాడుతూ.. జిల్లాలో వర మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు , మెదక్ జిల్లా అటవీశాఖ అధికారి జ్యోజీ, రామయంపేట రేంజ్ అధికారి విద్యాసాగర్, మెదక్, రామయంపేట, తూప్రాన్, కౌడిపల్లి, పెద్ద శంకరంపేట, లాల రేంజ్ అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాళ్లు మొక్కిన కనికరించడం లేదు

- కళ్ళల్లో పోసి రెండు మాసాలు గడుస్తున్నాయి
- మొరపెట్టుకున్న అధికారుల స్పందన కరువు
- ప్రభుత్వానికి సోయి లేదా ..
- ధర్నాలు రాస్తరోకాలు చేసిన ఫలితం శూన్యం
- బి ఆర్ ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి


**జగదేవపూర్, ఆశ్వి అప్డేట్స్**

కాళ్లు మొక్కిన కనికరించడం లేదని. కల్లాల్లో ధాన్యం పోసి రెండు మాసాలు గడుస్తున్నా వారి మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం గాఢ నిద్రలో ఉన్నదని బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగదేవపూర్ మండల కేంద్రంలోని వడ్ల కల్లాలను శుక్రవారం రోజున కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఆయన సందర్శించిన క్రమంలో లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు వడ్ల కళ్ళల్లో గత రెండు నెలల క్రితం ఆరుగాలం కష్టపడి పండించిన మక్కా పంటను కళ్ళల్లో పోసి రెండు నెలలు గడుస్తున్నా వాటిని కొనడం లేదని రాత్రి వేళలో కళ్ళం వద్ద పాములు , తేళ్ల భయం ఉందని ఆయన కాళ్లపై పడి ఆయనతో ఆమె బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతులకు అండగా ఉంటామని చెప్పి నేడు వారిని రాత్రింబవలు కల్లాల వద్ద కొనుగోలు చేయక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారికి గన్ని బ్యాగులు ,కరెంటు సరఫరా సక్రమంగా చేయకుండా కాంటాలు, లేవని రైతులు వారి పైసలతో బ్యాగుల్లో వడ్లు నింపినా లారీలు కూడా రావడం లేదని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. మండలంలో ఇప్పటికీ లక్ష క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రాశుల రూపంలో ఉందని రైతులు రాత్రనక, పగలనకా అక్కడే వేచి ఉంటున్నారని ఎప్పుడు కాంటాలు వేస్తారో వేచి చూస్తున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వడ్లు కొనుగోలు చేయకపోతే వడ్లను రాజీవ్ రహదారి వద్ద రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ,బిజెపి నాయకులు ఓట్ల కోసం వచ్చి ఓట్లు అడిగేటప్పుడు కనిపించారే తప్ప మరి రైతులు వారి ఆర్థనాదాలు ఇప్పుడు వారి వినిపించడం , కనిపించడం లేదా అంటూ వారిపై మండిపడ్డారు. కాంగ్రెస్, బిజెపి వారు కల్లాల వద్ద కనిపిస్తే వారి కళ్ళలో కారం పోసి కొట్టి పరిస్థితులు ఉన్నాయని వంటేరు ప్రతాపరెడ్డి మండిపడ్డారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశారని గుర్తు చేశారు. కానీ నేడు దొంగల చేతిలో రాష్ట్రాన్ని కట్టబెట్టామని దోచుకోవడానికి ఉన్న సమయం రైతుల పైన లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు అన్యాయం జరగకుండా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ మచ్చ గణేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, తదితరులు ఉన్నారు.



# కాక్రోచ్ జనతా పార్టీ నిరసనపై పిల్

## తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ




**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై తక్షణ విచారణ చేపట్టేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ప్రజా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రభుత్వ మౌలిక వసతుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరింది. నిరసన కార్యక్రమానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో ప్రచారం జరుగుతోందని, పెద్ద సంఖ్యలో యువతను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రచారంలో ఉన్న కొన్ని సందేశాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, భద్రతా బలగాల విధులకు ఆటంకం కలిగించే అంశాలు కూడా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిటిషనర్ వాదించింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరింది. ఈ విషయమై ఇప్పటికే ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సంప్రదించినప్పటికీ స్పందన లభించలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో చివరి మార్గంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపింది. అయితే, పిటిషన్‌ను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై తక్షణ విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అత్యవసర విచారణకు నిరాకరించింది. దీంతో ఈ వ్యవహారం తదుపరి విచారణకు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాహుల్ ఆన్‌లైన్ క్యాంపెయిన్!

## కేంద్ర ప్రభుత్వ రూ. 80 వేల కోట్ల మెగా ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు

## దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ సంతకాల సేకరణకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ అగ్రనేత



**న్యూఢిల్లీ:** అండమాన్, నికోబార్ దీవులలోని గ్రేట్ నికోబార్ దీవిని ఒక వ్యూహాత్మక, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' ఇప్పుడు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు 80 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష పార్టీలు మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సరికొత్తగా ఆన్‌లైన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల గ్రేట్ నికోబార్ దీవిలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా చ+తీవవఅూజవతీ+తీవవ‌స, చడీఅశీఝతీవీఖవతీం వంటి హ్యాష్‌ట్యాగ్స్‌తో దేశవ్యాప్త సంతకాల సేకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ పనుల కారణంగా నికోబార్ దీవుల్లో స్కూబా డైవింగ్‌తో పాటు ఇతర నిర్మాణ కార్యకలాపాల వల్ల అక్కడి అరుదైన పగడపు దిబ్బలు (కోరల్ రీఫ్స్) తీవ్రంగా విధ్వంసం అవుతున్నాయంటూ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏంటి ఈ గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్?

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రేట్ నికోబార్ దీవిలో పలు కీలక మౌలిక వసతుల నిర్మాణాలు జరగనున్నాయి. అందులో ముఖ్యంగా అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, భారీ విద్యుత్ ఉత్పాదన కేంద్రం, ఒక అత్యాధునిక టౌన్‌షిప్ నిర్మాణం, భారత ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఈ ప్రాజెక్ట్ ఎంతో కీలకమని ప్రభుత్వం భావిస్తుండగా, పర్యావరణాన్ని పణంగా పెట్టి ఈ ప్రాజెక్ట్ చేయవద్దంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు తమ నిరసనను ఉధృతం చేస్తున్నాయి.

# భారత్‌పై పుతిన్ ప్రశంసలు

## విదేశాంగ విధానానికి మద్దతు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ రాజకీయాల్లో భారత్ స్వతంత్ర వైఖరితో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ దేశానికి ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వార్తా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై బాహ్య ఒత్తిళ్లు తీసుకురావాలనే ప్రయత్నాలు గతంలో జరిగినప్పటికీ అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పుతిన్ అన్నారు. ముఖ్యంగా రష్యాతో సంబంధాల విషయంలో భారత్ తన స్వతంత్ర నిర్ణయాలను కొనసాగించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఏ దేశంపైనా ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదని, అలాంటి చర్యలు ప్రపంచ స్థాయి దౌత్య సంబంధాలను బలహీనపరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నిరంతరం పెరుగుతున్నాయని, రాబోయే కాలంలో ద్వైపాక్షిక వాణిజ్య విలువ వంద బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధనం, పరిశ్రమలు, సాంకేతికత, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్ వంటి పెద్ద దేశంపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు ఆ చర్యలకు పాల్పడే దేశాలకే ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చని పుతిన్ హెచ్చరించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి దేశంతో సంబంధాలను దెబ్బతీయడం అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రభావాలను కలిగిస్తుందని అన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా దేశాల మధ్య సంబంధాలు కొనసాగాలని సూచించారు. భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తోందని పుతిన్ అభిప్రాయపడ్డారు. భారత్‌తో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహబంధం భవిష్యత్తులో కూడా మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం కొత్త స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

# సంక్షోభం.. సానుకూలంగా!

- టీఎంసీలో తిరుగుబాటు.. మమతకు పెరుగుతున్న ఇబ్బందులు
- కాంగ్రెస్‌పై డీఎంకే అసంతృప్తి.. మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఇదే సరైన సమయంగా భావిస్తున్న బీజేపీ
- డీలిమిటేషన్ బిల్లుపై ఫోకస్ పెంచిన కేంద్రం
- ప్రత్యేక మెజారిటీ కోసం ప్రాంతీయ పార్టీల మద్దతుపై ఆశలు



**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రతిపక్షాల ఇండియా కూటమిలో విభేదాలు పెరుగుతుండగా, కొన్ని కీలక ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న సంక్షోభాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకెళ్లేందుకు ఇదే సరైన సమయమని కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయనే వార్తలు వస్తున్నాయి. మమతా బెనర్జీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతల సంఖ్య పెరుగుతోందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అదే సమయంలో పార్టీ ఎంపీల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయనే ప్రచారం కొనసాగుతోంది. మరోవైపు తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే చల్లబడినట్లు రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికల అనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌పై డీఎంకేలో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులను బీజేపీ నిశితంగా గమనిస్తున్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశం కావడంతో పార్లమెంటులో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. గతంలో సంఖ్యాబలం కొరత కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల్లో ఏర్పడుతున్న విభేదాలు, మారుతున్న రాజకీయ సమీకరణాలు తమకు కలిసొస్తాయని బీజేపీ అంచనా వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ స్థానాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ అమలుకు కూడా డీలిమిటేషన్ కీలకంగా మారనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించినట్లు సమాచారం. 2029లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# అక్రోట్లతో ఔరా అనిపించే ఆరోగ్యం




ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రతి ఒక్కరికి ఉండే కోరిక. కానీ అందుకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఎక్కడ చూసినా విటమిన్లు, పోషకాలు పుష్కలంగా అందేలా చూసుకోవాలనిచెప్తారే కానీ ఏం తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాటిని ఎలా తినాలని మాత్రం పెద్దగా చెప్పరు. అయితే మనకు అద్భుతమైన ఆరోగ్యాన్ని అందించే వాటిలో అక్రోట్లు అవేనండి వాల్ నట్స్ టాప్‌లో ఉంటాయట. వీటిని తరచూ ఒక పద్ధతి ప్రకారం నిర్ణీత పరిమితలో తింటే లెక్కలేనన్న ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు చెప్తున్నారు. ఇవి తినడం వల్ల ఆయుర్ధాయం కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు. అక్రోట్లలో పోషల విలువలు సమృద్ధిగా ఉంటాయని, ఇవి మన ఆరోగ్యానికి దివ్యఔషదంలా పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు. ఇందులో ఉండే ప్రొటీన్స్, ఫ్యాటీ యాసడ్స్, ఐరన్, మెగ్నీషియమ్, థీయమిన్, రిబోఫ్లోవిన్, విటమిన్ బీ6, బీ12, ఏ, సీ, ఈ, కే లతో పాటు మరెన్నో పోషకాలు అక్రోట్లలో ఉంటాయి. వీటిని ప్రతి రోజూ పరగడుపున తింటే ఎన్నో లాభాలు ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. అక్రోట్స్ తింటే ఎలాంటి లాభాలుంటాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**మానసిక ఆరోగ్యానికి పవర్ హౌస్:**
మన మానసిక ఆరోగ్యానికి అక్రోట్లు పవర్ హౌస్‌గా పనిచేస్తాయి. వీటిని తరచుగా తినడం వల్ల న్యూరోడెజెనరేటివ్ వ్యాధులను ప్రమాదం తగ్గుతుంది. మెదరు వృద్ధాప్య ప్రక్రియను కూడా నెమ్మదించేలా చేస్తాయి అక్రోట్లు. మానసిక ఆరోగ్యానికి సహజపడతాయి. దీంతో పాటు మన బ్లడ్ షుగర్‌ను నియంత్రించడంలో కూడా అక్రోట్లు అద్భుతంగా పనిచేస్తాయి. టైప్ 2 దయాబెటిస్ ఉన్న వ్యక్తులకు అక్రోట్లు దివ్యఔషధాలే. వీటిలో గ్లైసెమిక్ చాలా తక్కువగా ఉంటుంది. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ సులభమవుతుంది.

**బరువు తగ్గడం:**
శరీర బరువు నిర్వహణలో కూడా అక్రోట్లు కీలకంగా పనిచేస్తాయి.వీటిలో క్యాలరీలు ఎక్కువగా ఉన్నా.. బరువు తగ్గడానికి ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. వాల్‌నట్స్(అక్రోట్స్)లో ఉండే ప్రొటీన్, ఫైబర్, ఆరగ్యకరమైన కొవ్వులు బరువు నిర్వహణలో కీలకంగా ఉంటాయి. ఇవి మనకు కడుపు నిండిన భావన కలిగించి మన క్యాలరీల ఇన్‌టేక్‌కు నియంత్రిస్తుంది.

**జ్ఞాపకశక్తి పెరుగుదల:** అక్రోట్రలు మన జ్ఞాపకశక్తికి దివ్యఔషధంలా పనిచేస్తాయి. శ్రద్ధ, ఏకాగ్రతను కూడా ఇవి పెంచుతాయి. ఇందులో ఉండే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు కలిగి ఉంటాయి. ఇవి మన నాడీ వ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచుతాయి. ఆందోళన తగ్గించడంలో కూడా అక్రోట్లు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి మన మానసిక ఒత్తిడిని తగ్గించింది, మానసిక స్థితిని మెరుగు పరచడంలో కూడా అక్రోట్లు అద్భుతంగా పనిచేస్తాయి.

ఇదే విధంగా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలను అక్రోట్లు కల్పిస్తాయి. ఇవి శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణలు చెప్తున్నమాట. అదే విధంగా వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా కొన్ని సమస్యలు ఉంటాయని వివరిస్తున్నారు. ఏదైనా మితంగా తీసుకుంటేనే మంచిదని చెప్తున్నారు. అంతేకాకుండా క్రమం తప్పకుండా ఈవీటిని తీసుకోవడం వల్ల మరెన్నో లాభాలు ఉంటాయని కూడా వైద్యులు చెప్తున్న మాట.





# నకిలీ గుడ్లను ఎలా కనుక్కోవాలి



కోడి గుడ్లు పోషకాలకు మూలం. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆహారంలో గుడ్లు ఒక ముఖ్యమైన భాగం. వైద్యులు కూడా క్రమం తప్పకుండా గుడ్లు తినాలని సిఫార్సు చేస్తున్నారు. కానీ ఇటీవల, మార్కెట్లో నకిలీ గుడ్ల సంఖ్య బాగా పెరిగింది. నకిలీ గుడ్లు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే నకిలీ గుడ్లు – నిజమైన గుడ్లు మధ్య తేడాని ఇపుడు తెలుసుకుందాం. నిజమైన గుడ్లు సహజమైన ఆకృతిని కలిగి ఉంటాయి, అయితే నకిలీ గుడ్లు తరచుగా మృదువుగా మరియు మెరుస్తూ ఉంటాయి. వాటి షెల్, ధ్వని, బరువు మరియు వాసనను చూడటం ద్వారా మీరు నిజమైన మరియు నకిలీ గుడ్ల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించవచ్చు.నిజమైన గుడ్డు యొక్క షెల్ సాధారణంగా కరుకుగా ఉంటుంది మరియు స్పర్శకు కొద్దిగా ధాన్యంగా ఉంటుంది. ఇది చిన్న, సహజ లోపాలను కలిగి ఉండవచ్చు.



**షెల్ :** నిజమైన గుడ్లు - నిజమైన గుడ్డు షెల్ సాధారణంగా గరుకుగా ఉంటుంది. అలాగే స్పర్శకు కొద్దిగా ధాన్యంగా ఉంటుంది. నకిలీ గుడ్లు - నకిలీ గుడ్డు షెల్ తరచుగా చాలా మృదువైన మరియు ఏకరీతిగా ఉంటుంది, ఇది నిజమైన గుడ్డు షెల్ కంటే మెరుగ్గా కనిపిస్తుంది.



**సౌండ్ టెస్ట్ :** నిజమైన గుడ్లు - పచ్చ సొన మరియు తెలుపు గట్టిగా కప్పబడి ఉండటం వలన కదిలించినప్పుడు శబ్దం రాదు. నకిలీ గుడ్లు - లోపల ద్రవం ఉండటం వలన కదిలించినప్పుడు శబ్దం వస్తుంది.

**షెల్ సమగ్రత :** నిజమైన గుడ్డు - నిజమైన గుడ్డు యొక్క పెంకు సాపేక్షంగా పెళుసుగా ఉంటుంది మరియు పగులగొట్టినప్పుడు సులభంగా విరిగిపోతుంది. నకిలీ గుడ్డు - నకిలీ గుడ్డు యొక్క షెల్ తరచుగా గట్టిగా ఉంటుంది మరియు పగులగొట్టడం కష్టం.ఇది ముక్కలు కాకుండా పెద్ద, ప్లాస్టిక్ వంటి ముక్కలుగా విరిగిపోవచ్చు.

**పచ్చసొన మరియు తెల్లసొన స్థిరత్వం :** నిజమైన గుడ్డు - పగిలినప్పుడు, నిజమైన గుడ్డు యొక్క పచ్చసొన గుండ్రంగా మరియు గట్టిగా ఉంటుంది, అయితే గుడ్డు లోని తెల్లసొన స్పష్టంగా మరియు కొద్దిగా ద్రవంగా ఉంటుంది.

నకిలీ గుడ్డు – నకిలీ గుడ్డు యొక్క పచ్చసొన తక్కువ గుండ్రంగా ఉండవచ్చు మరియు విరిగిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుడ్డులోని తెల్లసొన చాలా స్పష్టంగా మరియు అసాధారణ స్థిరత్వం కలిగి ఉండవచ్చు, తరచుగా చాలా మందంగా లేదా చాలా నీళ్ళతో ఉంటుంది.

నకిలీ గుడ్లు తినడం వల్ల వాటి ఉత్పత్తిలో ఉపయోగించే రసాయనాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ సింథటిక్ పదార్థాలు జీర్ణశయాంతర సమస్యలు, అలెర్జీ ప్రతిచర్యలు మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. నకిలీ గుడ్లను దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి, వీటిని గుర్తించడం మరియు నివారించడం చాలా ముఖ్యం. గుడ్లు తినడం వల్ల వాటి ఉత్పత్తిలో ఉపయోగించే రసాయనాల వల్ల అనేక ఆరోగ్య ప్రమాదాలు ఎదురవుతాయి.



# ఈ లడ్డూ రోజుకు ఒకటి తింటే చాలు

**కావలసిన పదార్థాలు**

అవిసె గింజలు - రెండు స్పూన్లు
గుమ్మడి గింజలు - రెండు స్పూన్లు
సన్ ఫ్లవర్ సీడ్స్ - రెండు స్పూన్లు
నువ్వులు - రెండు స్పూన్లు
ఓట్స్ - పావు కప్పు
ఖర్జూరాలు - పది
యాలకుల పొడి - చిటికెడు
నెయ్యి- ఒక స్పూను



ప్రస్తుత పరుగుల ప్రపంచంలో పోషకాహార లోపం అతి పెద్ద సమస్యగా మారుతుంది. పని ఒత్తిడి వల్లో, సమయం లేకనో చాలా మంది రెడి టు ఈట్ ఆహారం వైపు, ఫాస్ట్ ఫుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. అవి తినడం వల్ల ఆ కాసేపు నోటికి రుచికరంగా, ఆ క్షణానికి తినాలి అన్న పని ముగుస్తుంది. కానీ మనకు ఆరోగ్య పరంగా ఎటువంటి మేలు ఉండదు. పైగా అనారోగ్య కారకాలు అధికమైపోతాయి. ఈ విషయం అందరికీ తెలుసుకు. కానీ పని ఒత్తిడి బాస్.. ఫుడ్ ప్రిపేర్ చేసుకునే సమయం లేకనే ఇలా చేస్తున్నాం. లేకపోతే ఈ ఫుడ్ తినడం మాకు మాత్రం ఇష్టామా ఏంటి అని సమాధానం చెప్తారు. అయితే ఇకపై హెల్తీ ఫుడ్ కోసం వంటగదుల్లో ప్రతి రోజూ యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పిజ్జాలు, బర్గర్, ఫ్రైడ్ రైస్‌లు వంటి జంక్ తినడం వల్ల ఏర్పడిన పోషకాల లోపాలను రోజుకు ఒక్క లడ్డూ తినడం ద్వారా తగ్గించుకుకోవచ్చంటున్నారు. ఈ లడ్డూ ప్రతి రోజూ ఒకటి తింటే ఎటువంటి పోషకాహార లోపాలు ఉన్నా తగ్గుతాయని, వాటి వల్లు వచ్చేర సమస్యలు కూడా దూరమవుతాయని నిపునులు అంటున్నారు. అవే మల్టీసీడ్స్ లడ్డూలు. మరి వీటి రెసిపీ ఏంటో తెలుసా.. రండి చూసేద్దాం.



## మల్టీ సీడ్స్ లడ్డూ రెసిపీ

1. స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలు, నువ్వులు, ఓట్స్ వంటివన్నీ కూడా వేయించుకొని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూన్ నెయ్యిని వేయాలి.
3. ఆ నెయ్యిలో ఖర్జూరాలను సన్నగా తరిగి వేయించుకోవాలి.
4. ఆ ఖర్జూరం మిశ్రమంలోనే ముందుగా రుబ్బి పెట్టుకున్న పొడిని కూడా వేసి బాగా కలపాలి.
5. అలాగే యాలకుల పొడిని కూడా వేయాలి.
6. ఈ మొత్తం మిశ్రమాన్ని స్టవ్ ఆఫ్ చేసి మొత్తం మిశ్రమాన్ని చల్లార్చాలి.
7. ఇప్పుడు ఈ మిశ్రమంలో అవసరమైతే కొంచెం నెయ్యిని వేసుకొని లడ్డూల్లా చుట్టుకోవాలి.
8. అంతే టేస్టీ మల్టీ సీడ్స్ లడ్డు రెడీ అయినట్టే.
9. వీటిని సీసాలో ఉంచి మూత పెట్టాలి. ప్రతిరోజూ ఒకటి తింటే చాలు, మీ శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.

**వీటి వల్ల కలిగే ప్రయోజనాలు**

మల్టీ సీడ్స్ లడ్డు రెసిపీలో మనం అవిస గింజలను వాడాము. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణాలు ఉన్నాయి. అవిసె గింజలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోమని కూడా చెబుతారు. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. క్యాన్సర్ తో పోరాడుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అలాగే ఖర్జూరాన్ని కూడా ఎక్కువగానే వినియోగించాము. ఈ ఖర్జూరంలో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి.

ఖర్జూరంలో ఇనుము కంటెంట్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారు ఖర్జూరాన్ని ఆహారంలో భాగం చేసుకుంటే ఉత్తమం. ప్రతిరోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు కూడా చెబుతున్నారు. అలాగే గుమ్మడి గింజలు, సన్ ఫ్లవర్ సీడ్స్, నువ్వుల్లో కూడా ఆరోగ్యానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ కూడా మనకు పోషకాహార లోపం లేకుండా చేస్తాయి. కాబట్టి మల్టీ సీడ్స్ లడ్డును కచ్చితంగా మహిళలు పిల్లలు తినేందుకు ప్రయత్నించాలి.



# పొగడ్తలను తలకెక్కించుకోను..



టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్‌కు గత కొద్ది కాలంగా అదృష్టం అస్సలు కలిసి రావడం లేదు. ఎంత కష్టపడినప్పటికీ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. ఇటీవల చేసిన హరి హరి వీరమల్లు, ది రాజా సాబ్ రెండు భారీ అంచనాలు మధ్య విడుదలై ఆశించనంత స్థాయిలో హిట్ అందుకోలేకపోయాయి. నిధి కష్టపడినప్పటికీ శ్రమ అంతా వృధా అయిపోయింది. దీంతో గత కొద్ది కాలంగా నిధిపై విమర్శలు వస్తున్నాయి. కష్టపడినప్పటికీ ఇండస్ట్రీలో రాణించాలంటూ అదృష్టం కూడా ఉండాలని నెగెటివ్ కామెంట్లు పెడుతున్నారు. అంతేకాకుండా ఐరన్ లెగ్ అంటూ ట్రోల్ కూడా చేస్తున్నారు. తాజాగా, తనపై వస్తున్న విమర్శలపై నిధి అగర్వాల్ స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ పొగడ్తలను తలకెక్కించుకోను, అలాగే విమర్శలను అస్సలు పట్టించుకోను. ఇండస్ట్రీలో ఒక సక్సెస్‌ఫుల్ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుంది, దానికి నేనేమీ మినహాయింపు కాదు. కానీ, ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎ[illegible]హించలేరు. ఒక సినిమా సక్సెస్ అనేది చాలా విషయాలపై ఆధారపడి ఉంటుంది. నేను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయ్యాయి, అందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, నన్ను నేను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాను" అని చెప్పింది. తనను అదృష్టం లేని నటిగా విమర్శిస్తున్న వారికి సమాధానమిస్తూ.. తాను అదృష్టం కంటే కేవలం తన టాలెంట్‌ను మాత్రమే నమ్ముకుంటానని నిధి స్పష్టం చేసింది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా నటిగా తన వంద శాతం శ్రమను ఎప్పుడూ పెడుతూనే ఉంటానని తెలిపింది. నిధి చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్ని పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా, తన టాలెంట్‌పై నమ్మకంతో ఉన్న నిధిని అభిమానులు అభినందిస్తున్నారు.

## ఆ మ్యూజిక్ డైరెక్టర్ ని చూసి ఇతర సంగీత దర్శకులు చాలా నేర్చుకోవాలి

సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో మోస్ట్ టాలెంటెడ్ అండ్ బిజీయెస్ట్ సెలబ్రిటీలలో మ్యూజిక్ డైరెక్టర్ కమ్ హీరో జీవీ ప్రకాష్ కుమార్ టాప్ ప్లేస్ లో ఉంటాడు. ప్రస్తుతం జీవి చేతిలో గంపెడు సినిమాలు ఉన్నాయి. ఒకవైపు క్రేజీ ప్రాజెక్టులకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తూ, మరోవైపు నటుడిగా వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ కోలీవుడ్, టాలీవుడ్ లలో ఫుల్ బిజీగా ఉన్నాడు జీవీ.`
జీవీ ప్రకాష్ కేవలం తమిళంలోనే కాకుండా తెలుగులోనూ టాప్ స్టార్స్ చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నాడు. వాటిలో మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ఇరుముడి ఇటీవల రిలీజ్ అయినా గ్లిమ్స్ కు మంచి బిజియమ్ ఇచ్చాడు. ఇక కోలీవుడ్ స్టార్ సూర్య, యాక్షన్ కింగ్ విశాల్ ల రాబోయే సినిమాలకు కూడా జీవీనే సంగీతం అందిస్తున్నాడు. అనిరుధ్ త్వరగా ఇవ్వడు, తమన్ తెలుగులో ఫుల్ బిజీ కావడంతో అగ్ర దర్శకులు, అగ్ర హీరోల ఫస్ట్ ఛాయిస్ గా జీవీ ప్రకాష్ దూసుకుపోతున్నారు. సంగీత దర్శకుడిగా ఇంత బిజీగా ఉంటూనే జీవీ ప్రకాష్ హీరోగా కూడా వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. నటుడిగా జీవీ డైరీ ప్రస్తుతం పూర్తిగా నిండిపోయింది. ఉదయం రికార్డింగ్ థియేటర్ లో కంపోజింగ్ లో ఉంటే మధ్యాహ్నం సినిమా సెట్స్ లో కెమెరా ముందుకు వచ్చి నటిస్తూ 24/7 బిజీగా గడుపుతున్నారు. సాధారణంగా ఒకే రంగంలో రాణించడం కష్టంగా భావించే ఈ రోజుల్లో సంగీతం, నటన అనే రెండు భిన్నమైన విభాగాల్లో జీవీ ప్రకాష్ చూపిస్తున్న మల్టీ టాస్కింగ్ ప్రతిభ నిజంగా అభినందనీయం. టైమ్ మేనేజ్మెంట్ లో జీవీ ప్రకాష్ రూటే వేరు. ఇంత క్రేజీ ప్రాజెక్టులను బ్యాలెన్స్ చేస్తూ ఏ ఒక్కదానికీ ఆలస్యం కాకుండా వర్క్ పూర్తి చేయడం చూస్తుంటే ఇతర మ్యూజిక్ డైరెక్టర్లు కూడా జీవీ ప్రకాష్ ని చూసి నేర్చుకోవాల్సిందే అని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.





## వరుస ఫ్లాపుల తర్వాత హిట్ కోసం వైష్ణవ్ తేజ్ భారీ స్కెచ్..

మెగా హీరో వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీసు వద్ద తన సత్తా చాటారు. మొదటి మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ తర్వత రంగరంగ వైభవంగా, కొండ పొలం వంటి చిత్రాలు చేసినప్పటికీ వైష్ణవ్ తేజ్ హిట్ అందుకోలేకపోయారు. ఇక 2023లో చేసిన ఆదికేశవ కూడా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. ఇలా వరుసగా మూడు ఫ్లాపులు రావడంతో వైష్ణవ్ తేజ్ తీవ్ర నిరాశకు గురయ్యారు. తదుపరి సినిమా విషయంలో ఎలాగైనా సరే హిట్ కొట్టాలనే పట్టుదలతో ఆయన ఇండస్ట్రీకి కాస్త గ్యాప్ ఇచ్చారు. కేవలం హిట్ కోసమే కాకుండా, తన నటనకు సరిపోయే వైవిధ్యమైన కథ కోసం వేట ప్రారంభించారు. ఈ క్రమంలో.. గత మూడేళ్లలో ఆయన ఏకంగా 100కు పైగా కథలను విన్నట్లు టాక్. ఎన్నో కథలను తిరస్కరించిన తర్వాత, ఎట్టకేలకు ఆయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఖర[illegible]చేసుకున్నట్లు సమాచారం. దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక అద్భుతమైన కథాంశం నచ్చడంతో వైష్ణవ్ తేజ్ ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన AK ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఆ వెంటనే సినిమా షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందట. లాంగ్ గ్యాప్ తర్వాత వైష్ణవ్ తేజ్ ఒక మంచి కథతో వస్తుండటంతో మెగా అభిమానుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. 100 కథలు విని ఓకే చేసిన ఈ సినిమాతో వైష్ణవ్ తేజ్ మళ్లీ 'ఉప్పెన' లాంటి ఘన విజయాన్ని అందుకుని, సక్సెస్ ట్రాక్‌లోకి ఎక్కుతారని అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


## వాళ్లను స్వయంగ కలిసి ఈ కథ రాశా..



'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వస్తున్న మూవీ 'నూరు సామి'. తెలుగులో ఈ చిత్రం 'వంద దేవుళ్ళు' పేరుతో రిలీజ్ కాబోతున్నది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య జూన్ 19న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా సినిమాకు సంబంధించిన విశేషాలు పంచుకున్నాడు డైరెక్టర్ వశి. 'నూరుసామి కథ ఒక వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందించబడింది. నేను మొదట వారిని ఒక రియాలిటీ షోలో చూశాను. ఆ షో చూస్తున్నప్పుడు నాకు ఎంతో బాధ, భావోద్వేగం కలిగాయి. ఆ తర్వాత, నేను వారిని స్వయంగా కలిసి, వారి గ్రామాన్ని సందర్శించి, అక్కడి చాలా మందిని ఇంటర్వ్యూ చేశాను. వారిని నిజ జీవితంలో కలవడం, వారి అనుభవాల గురించి తెలుసుకోవడం ఈ కథను రాయడానికి నాకు ఎంతగానో సహాయపడింది' అని తెలిపారు. కాగా.. ఈ చిత్రంలో స్వాసిక అజయ్, కావ్య, శక్తి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. రామాంజనేయులు జవ్వాని నిర్మిస్తున్నారు.

## ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి.. టీజర్ అప్డేట్‌తో సినిమాపై హైప్


వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా దూసుకుపోతున్న అక్కినేని సుమంత్ త్వరలో ప్రతిష్టాత్మక చిత్రం 'మహేంద్రగిరి వారాహి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం, అతీంద్రియ శక్తులు, కొన్ని రహస్య మరణాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చెయ్యగా సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అలాగే ఇటీవల ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని నెలకొల్పగా.. ఇప్పుడు అదే జోష్‌తో తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'మహేంద్రగిరి వారాహి ద్వారాలు తెరుచుకోబోతున్నాయి. రహస్యాలు, విశ్వాసం, అంతుచిక్కని విషయాలతో కూడిన ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి. జూన్ 8 న మహేంద్రగిరి వారాహి టీజర్ రాబోతున్నది సిద్ధంగా ఉండండి' అంటూ చెప్పుకొచ్చారు. కాగా.. మీనాక్షి గోస్వామి, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా.. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మధు కాలిపు, లక్ష్మణ్ నిర్మిస్తున్నారు.



## ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు..




మూడేళ్ల గ్యాప్ తర్వాత అక్కినేని అఖిల్ మళ్లీ 'లెనిన్' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళి కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా కనిపించనుంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను జూన్ 26న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ జోరు పెంచి వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు. మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసి ఇప్పటికే రెండు పాటలను విడుదల చేయగా.. ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సోల్ ఆఫ్ లెనిన్' పేరుతో మూడో పాటను విడుదల చేశారు. ఈ పాట ఎమోషనల్‌గా [illegible]ా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.
ముఖ్యంగా ఈ సాంగ్ విడుదల చేస్తూ చిత్రబృందం సోషల్ మీడియాలో పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. "ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు" అనే ఆసక్తికరమైన లైన్‌ను జోడించడంతో, సినిమాలో ప్రేమ ,యాక్షన్ అంశాలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయో అర్థమవుతోంది. స్టార్ కంపోజర్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మూడేళ్ల నిరీక్షణ తర్వాత అఖిల్ పక్కా మాస్ అండ్ క్లాస్ సబ్జెక్ట్‌తో వస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



## 100 కథలు రిజెక్ట్ చేసి ఎట్టకేలకు కొత్త సినిమాను లైన్ లో పెట్టిన యంగ్ హీరో

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రుక్మిని వసంత్, నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రలో కనిపించనున్నారు. డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. ఇందులోంచి వచ్చిన టీజర్ సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఇక ముందుగా మార్చిలో విడుదల చేయాలనుకున్న మేకర్స్ పలు కారణాల వల్ల జూన్ 4న వాయిదా వేశారు. నిజానికి ఈ సినిమాను జూన్ 4న (నేడే) విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే నేడు సినిమా రిలీజ్ కావాల్సి ఉన్నా, ఎలాంటి ప్రమోషన్స్ కానీ, అప్‌డేట్స్ కానీ లేకపోవడంతో సోషల్ మీడియాలో పలు రకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. మూవీ షూటింగ్ పూర్తయినప్పటికీ షాకింగ్ ట్విస్ట్ వచ్చి పడింది. అయితే కొన్ని సీన్స్ విషయంలో హీరో యష్ అసంతృప్తిగా ఉన్నారని.. అందుకే ఏకంగా 100 రోజుల పాటు కొన్ని కీలక సన్నివేశాలను రీషూట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. దీనికి తోడు విదేశీ పంపిణీ పరంగా కొన్ని సమస్యలు తలెత్తడం కూడా వాయిదాకు కారణమని అంటున్నారు. ఈ కారణాల వల్లే సినిమాను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ, నేడు థియేటర్లలో చూడాల్సిన సినిమా ఇలా వాయిదా పడటం.. రీషూట్ వార్తలు రావడం చూసి యష్ ఫ్యాన్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిజంగానే ఇప్పట్లో విడుదల చేయరేమో అని పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in